క్లుప్తంగా

పిల్లలను బడికి పంపించాలి



ఎల్లారెడ్డి: విద్యార్థులను సక్రమంగా పాఠశాలలకు పంపాలని వెల్లుట్ల జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటి వద్దకు, వారు పని చేస్తున్న ప్రాంతాలకు వెళ్లి అవగాహన కల్పించారు. పాఠశాల సమయంలో విద్యార్థులతో ఇంటి పనులు, పొలం పనులు చేయించవద్దని సూచించారు. సీఆర్పీ మహిపాల్, తదితరులున్నారు.

క్రీడాకారుడికి సన్మానం



దోమకొండ: దోమకొండకు చెందిన అర్చరీ క్రీడాకారుడు అనుదీప్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి రాజు సోమవారం సన్మానించారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అర్చరీ పోటీల్లో అనుదీప్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభతో పతకాలు సాధించాడు. గుజరాత్‌లో జరిగే జాతీయ ఎస్‌జీఎఫ్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అనుదీప్ 9వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా అనుదీప్‌ను డీఈవో సన్మానించి అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రసూల్, కార్యదర్శి నర్సింహారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



నిజాంసాగర్(జుక్కల్): ప్లాంటేషన్లలో మొక్కల సంరక్షణపై తగు చర్యలు తీసుకోవాలని బాన్సువాడ అటవీ శాఖ రేంజ్ అధికారి అబీబ్ అన్నారు. సోమవారం మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ శివారులోని ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. ఆ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల గుంతల్లో మట్టిని నింపాలన్నారు. మొక్కల సంరక్షణకు తవ్విన గుంతల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. అటవీ శాఖ సెక్షన్ అధికారి సంజీవ్, బీట్ అధికారి నర్సింగ్ తదితరులు ఉన్నారు.

త్రిలింగేశ్వరాలయంలో ఎస్‌బీఐ ఆర్‌ఎం పూజలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్‌లోని త్రిలింగేశ్వరాలయంలో సోమవారం వరంగల్ ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రఘునాథ్ ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం సోమవారం పురస్కరించుకుని కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలోని స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. వారివెంట ఆలయ కమిటీ పూజారి దత్తుతోపాటు ఇతర భక్తులు ఉన్నారు.

ఘనంగా హజ్రత్ కమల్‌షా ఉర్సు

నిజామాబాద్ సిటీ: నగరంలోని కంఠేశ్వర్ హజ్రత్ కమల్ షా బియాబాని (ఆర్‌ఏ)లో ఉర్సు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా నగరంలో చాదర్, గంధం ఊరేగింపు నిర్వహించారు. మూడురోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలను దర్గాకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్ వంశస్తులు నిర్వహిస్తున్నారు. మహ్మద్ అబ్దుల్ హఫీజ్, ఖాజమోయినుద్దీన్, జహీర్, హైమద్ అలీ, ఎంఏ ఆఫీస్, మోయిస్, ఖాదిర్, నసీయుద్దిన్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంత్‌చారికి తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వినాయక్‌నగర్‌లోని శ్రీకాంత్‌చారి విగ్రహానికి వారు పూలమాలలు వేసి, ఆయన పోరాటాన్ని కొనియాడారు. టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కల్యాణ్‌రామ్ మట్లాడుతూ.. ఒక విద్యార్థి సమాజం కోసం తాను చేసే ఉద్యమంలో ఎటువంటి త్యాగానికైనా వెనుకాడడని శ్రీకాంత్‌చారి నిరూపించారని కొనియాడారు. కార్యక్రమంలో నవీన్, సాయి కిరణ్, దేవేందర్, రవికిరణ్, ప్రశాంత్, అశోక్, భీంరావు తదితరులు పాల్గొన్నారు

సమీకృత భవనానికి మోక్షమెన్నడో?

- ఇరుకు గదుల్లో అధికారులకు ఇబ్బందులు
- పూర్తయితే ఎంపీడీవో ఆఫీసులో పీహెచ్‌సీ ఏర్పాటు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సమీకృత భవనం ప్రారంభమై నెలలు గడుస్తున్నా కూడా అందులో అధికారులకు సౌకర్యాలు కల్పించలేదు. ఎన్నికల కోడ్ వస్తుందన్న తరుణంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా భవనం ప్రారంభించారు. కానీ గుత్తేదారు అలసత్వం కారణంగా పనులు సాగకపోవడంతో అధికారులకు భవనం ఇంకా అందించలేదు. దీనితో మండల పరిషత్ కార్యాలయం ఇరుకు గదుల్లో కొనసాగుతోంది. ప్రజలకు అన్ని రకాల అధికారులు ఒక చోట అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో సమీకృత భవనం ఏర్పాటు చేశారు. అయితే ఆగస్టు 15న జెండా ఎగరేయాలని స్పీకర్ ఆదేశించినా గుత్తేదారు అందివ్వలేదు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ చివరి రోజున ప్రారంభించారు. ఎన్నికలు ముగిసినా కూడా ఇంకా పనులు పూర్తి కాలేదు. ఇలా పనులు కొనసాగుతూనే ఉండటంతో అధికారులు నిరాశ చెందుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న నస్రుల్లాబాద్ సమీకృత భవనం

పీహెచ్‌సీ ఏర్పాటు ఎన్నడో..?

నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి పీహెచ్‌సీ మంజూరైంది. అయితే ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయం కొనసాగుతున్న భవనంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తున్నట్లు నివేదికలను సిద్ధం చేశారు. అధికారులు త్వరలోనే తమ భవనం ఆరోగ్య శాఖకు అప్పగిస్తామన్న తీర్మానాన్ని కూడా అందించారు. అటు సమీకృత భవనం పూర్తయితేనే ఎంపీడీవో కార్యాలయం ఖాళీ అవుతుంది. దీనితో అధికారులు, ప్రజలు సమీకృత భవనాన్ని గుత్తేదారు పూర్తి చేసేది ఎన్నడోనని నిట్టూరుస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమీకృత భవనం అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిసిన బీజేపీ శ్రేణులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి నియోజవకర్గ బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని మండలంలోని ఆయా గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సన్మానాలు

కామారెడ్డి టౌన్: బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని సోమవారం ఆయన నివాసం వద్ద అభిమానులు, నాయకులు తరలివచ్చి సన్మానాలు చేశారు. ఉదయం నుంచే నియోజకవర్గంలోని బీజేపీ శ్రేణులు, నాయకులు, కుల సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, యువకులు, మహిళలు భారీగా తరలివచ్చి శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఆయన అందరిని అప్యాయంగా పలకరించారు. తన గెలుపుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు.



వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న మహిళలు



కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న లింగాపూర్ బీజేపీ శ్రేణులు

ఓట్ల సరళిని చూస్తే భవిష్యత్‌లో తప్పక గెలుస్తాం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ

బాన్సువాడ : నియోజకవర్గంలో బీజేపీకి వచ్చిన ఓట్ల సరళిని చూస్తే భవిష్యత్‌లో తప్పకుండా బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం బాన్సువాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బాన్సువాడలో 2018లో బీజేపీకి 2,998 ఓట్లు వస్తే ఈ సారి 23,685 ఓట్లు వచ్చినట్లు తెలిపారు. కార్యకర్తల సమిష్టి కృషితోనే ఈ ఓట్లు సాధ్యమైందని అన్నారు. ప్రజలు మార్పు కోరుకున్నారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు ప్రజలు ఆకర్షితులయ్యారని అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు పని చేసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీని గెలిపించుకుంటామని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొరబాబు, నాయకులు చీదరి సాయిలు, పైడిమల్ లక్ష్మీనారాయణ, కోనాల గంగారెడ్డి, శ్రీనివాస్, సాయిలు, రాజాసింగ్, శంకర్‌గౌడ్ ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నేత యెండల

మొక్కు తీర్చుకున్న బీజేపీ కార్యకర్త

భిక్కనూరు: కామారెడ్డి ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణరెడ్డి గెలుపొందడంతో మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని మల్లికార్జున్ స్వామి ఆలయంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ఊరడి భాస్కర్ 101 కొబ్బరి కాయలను స్వామి వారి ఎదుట కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే స్వామి వారికి 101 కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నానని స్వామి వారి కృపతో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందాడని అందుకే తన మొక్కును చెల్లించుకున్నానన్నారు. బీజేపీ నేతలు బస్వారెడ్డి, గణేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింలు, బాబు, సిద్ధరాములు పాల్గొన్నారు.



తిప్పాపూర్‌లో మల్లికార్జునస్వామి ఆలయంలో కొబ్బరి కాయలు కొడుతున్న కార్యకర్తలు

కాంగ్రెస్ సంబురాలు

భిక్కనూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, నేతలు ర్యాలీలు తీశారు. యువకులు నృత్యాలు చేస్తూ జై కాంగ్రెస్, జైజై కాంగ్రెస్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



భిక్కనూరులో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



పాదయాత్రగా వెళ్తున్న రుద్రారం సర్పంచ్ సత్తయ్య



తలనీలాలను సమర్పించిన సాల్మన్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావును గెలిపించినందుకు మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలకేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేలా చూస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులను సమకూర్చుకొని మండలాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసుకుందామని వారు పేర్కొన్నారు. మండలంలోని అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇప్పించడంతో పాటు నిరుపేద కుటుంబాలకు ఇళ్లు కట్టించేలా కృషి చేస్తామన్నారు. నాయకులు బొల్లు నర్సింహారెడ్డి, నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, ధర్మారెడ్డి సర్పంచ్ శ్రీధర్‌గౌడ్, విఠల్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, విఠల్, వాసురెడ్డి, కిష్టయ్య, పర్వతరావు, ఆంజనేయులు, శేఖర్, సత్యనారాయణ, లక్ష్మణ్, ఇమామ్ పాల్గొన్నారు.

మదన్‌మోహన్ గెలుపు..సర్పంచ్ పాదయాత్ర

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మదన్ మోహన్ గెలవడంతో రుద్రారం గ్రామ సర్పంచ్ సత్తయ్య సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యేగా మదన్ మోహన్ గెలిస్తే రుద్రారం నుంచి మెదక్ చర్చి వరకు పాదయాత్రగా వస్తానని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో ఆయన పాదయాత్రగా వెళ్లారు.

తలనీలాలు సమర్పించిన కార్యకర్త..

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మదన్ మోహన్ గెలిస్తే తలనీలాలు సమర్పిస్తానని కాంగ్రెస్ కార్యకర్త సాల్మన్ మొక్కుకున్నట్లు తెలిపారు. మదన్‌మోహన్ ఎమ్మెల్యేగా గెలవడంతో సాల్మన్, మత్తమాల గ్రామంలోని చర్చి వద్ద తలనీలాలను సమర్పించారు.

మాచారెడ్డిలో కాంగ్రెస్ హవా

మాచారెడ్డి: మాచారెడ్డి మండలం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలిచింది. తాజాగా మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, వెంకట రమణారెడ్డిలు బరిలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బడా నేతలు చాలా మంది బీఆర్‌ఎస్‌లో చేరినప్పటికీ మండలంలో మొత్తం 3,200 ఓట్లు కేసీఆర్, కేవీఆర్‌ల కన్నా కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్ రెడ్డికి ఎక్కువ వచ్చాయి. గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి జెడ్పీటీసీ, ఎంపీపీ, 14 ఎంపీటీసీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అప్పటికి ఇప్పటికి మాచారెడ్డి కాంగ్రెస్ పార్టీ హవా అలాగే కొనసాగుతోందని పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు వాఖ్యానించారు.

‘జుక్కల్ ప్రజలకు రుణపడి ఉంటాం’

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించినందుకు మండల ప్రజలందరికి రుణపడి ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేందర్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అన్నారు. ప్రజల సమస్యలు తీర్చడం కోసం అహర్నిశలు కష్టపడి పని చేసి మీ రుణాన్ని తీర్చుకుంటామని అన్నారు. నేతలు చిప్ప మోహన్, నాగిరెడ్డి, శామప్ప పటేల్, మోగుల గౌడ్, పండరి, శంకర్ గౌడ్, బస్వరాజు, మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేందర్ రెడ్డి

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

బీబీపేట: వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని ఏడీఈ కిరణ్ చైతన్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ప్రతి బోరు బావి కోసం అనుమతి తీసుకోవాలని, అనుమతులు లేకుండా మోటార్లను నడిపించొద్దని సూచించారు. అంతే కాకుండా ఈ సీజన్‌లో పంటలు అయిపోయినందున మంజూరు కోసం డీడీలు చెల్లించాలని, యాసంగి సీజన్ వరి నాట్లు లోపల పనులు చేయడానికి సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఆన్‌లైన్ చెల్లింపులు జరిపించేలా చూడాలని విద్యుత్ సిబ్బందికి సూచించారు. ఏఈ దివ్య గాయత్రి, సిబ్బంది ఉన్నారు.

‘తోట’కు మంత్రి పదవి ఇవ్వాలి

- కాంగ్రెస్ నేతల డిమాండ్



నిజాంసాగర్(జుక్కల్): వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన కాంగ్రెస్ నేత తోట లక్ష్మీకాంతరావుకు మంత్రి పదవి ఇవ్వాలని నిజాంసాగర్ మండల కాంగ్రెస్ నేతలు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నిజాంసాగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగినా ఏ ఒక్కరికి కూడా మంత్రి పదవి దక్కలేదని గుర్తు చేశారు.

అలరించిన సహస్ర కార్తీక దీపోత్సవం



కామారెడ్డి విశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో శివలింగం ఆకారంలో దీపాలను వెలిగించిన దృశ్యం

కామారెడ్డి అర్బన్: కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా సాయంత్రం స్థానిక విశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో సహస్ర కార్తీక దీపోత్సవం నిర్వహించారు. దీపోత్సవంలో విద్యానగర్ కాలనీ మహిళలతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించారు. ఓం నమఃశివాయ, శివ లింగం, స్వస్తిక్, ఓం అక్షరాలతో దీపాలను అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు.

శివాలయాల్లో కార్తీక శోభ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి గ్రామంలో గల సోమలింగేశ్వర ఆలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా భక్తులు దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కంది పంటకు తెగుళ్ల బెడద



మద్నూర్‌లో కందికి స్ప్రే చేస్తున్న రైతు

మద్నూర్(జుక్కల్): కంది పంటకు విపరీతమైన తెగుళ్లు ఆశించడంతో రైతన్నలు ఆగమవుతున్నారు. మండలంలోని కంది పంట ప్రస్తుతం భారీ పూత, కాత దశలో ఉంది. పంటకు విపరీతంగా పచ్చ పురుగులు ఆశించి కాయకు రంధ్రాలు చేసి గింజలను తినేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను రెండు రోజులు చూడకుంటే వేసిన పంటను పురుగులు మొత్తం ఒక్క గింజ మిగల్చకుండా తినేసే పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. తెగుళ్ల నివారణకు మందులు స్ప్రే చేస్తున్నా పురుగులు మాత్రం తగ్గడం లేదని వారు వాపోతున్నారు. దీనిపై వ్యవసాయ అధికారులు తగు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సమాచారం..

రేపు వీరభద్ర స్వామి ఆలయంలో అగ్ని గుండం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం అగ్నిగుండం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు సంగాయప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి యేడు స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో కల్యాణం, అగ్ని కణికలపై భక్తులు నడిచి భక్తిని చాటుకుంటారని అన్నారు. వీరభద్రుడి ఉత్సవాల సందర్భంగా శోభాయాత్ర, అన్నదానం చేపడతామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

7న విఠలేశ్వర ఆలయంలో అన్నపూజ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి గోపాలస్వామి రోడ్డులోని విఠలేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 7న గురువారం శివుడికి అన్నపూజ, అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు కాశీనాథం తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రికవరీ డబ్బులను చెల్లించాలి

డిచ్‌పల్లి: ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్‌లో అభియోగాలు వచ్చిన వారందరూ రికవరీ డబ్బులు వెంటనే చెల్లించాలని ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు సూచించారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీఆర్‌డీఏ అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, సోషల్ అడిట్ విజిలెన్స్ ఆఫీసర్ నారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గత సోషల్ ఆడిట్‌లో ఉపాధిహామీ పనులపై 368 అభియోగాలు వచ్చాయన్నారు. రూ.2.41 లక్షలు రికవరీ చెల్లించాల్సి ఉంటుందని ఆడిట్‌లో తేలిందన్నారు. అభియోగాలు వచ్చిన వారిలో కొందరు ఇప్పటికే రూ.లక్షా 50వేలు రికవరీ చెల్లించినట్లు తెలిపారు. సుమారు రూ.90వేలు రికవరీ చెల్లించాల్సి ఉండగా సోమవారం కొందరు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది రూ.27వేలు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రికవరీ సొమ్ములను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. 2024–25 సంవత్సరానికి హరితహారానికి సంబంధించి గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో గోపిబాబు

కేసీఆర్‌ను కలిసిన ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్ : బాల్కొండ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా మూడవసారి విజయం సాధించిన వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మోపాల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, ఆ నమ్మకంతోనే మండల ప్రజలు చేతి గుర్తుకు ఓటేసి గెలిపించారని పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికార పార్టీ అభ్యర్థులు ఎన్ని ఆటంకాలు సృష్టించినా ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి రాష్ట్రంలో అధికారాన్ని అప్పగించారని తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు విసిగి వేసారి పోయారని, మార్పు కోరుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి ఎమ్మెల్యే భూపతిరెడ్డి గెలుపునకు సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.